


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

సోమవారం | 08 | జూన్ | 2026 | పేజీలు: 08


# స్వంతింటితో నెరవేరిన స్వప్నం

**ప్రజల దరికే పాలన**

**లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం**

**జనం మాట...పల్లెబాటకు**

**ఎమ్మెల్యే బిఎల్ఆర్ శ్రీకారం**

**ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎమ్మెల్సీ**





**మిర్యాలగూడ/ వేములపల్లి, అక్షిత ప్రతినిధి :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారమే ధ్యేయంగా మిర్యాలగూడ నియోజక వర్గంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో జనం మాట-పల్లెబాట అనే ..మిగతా 2లో

# అంతర్గత రోడ్లతో ప్రయాణం సులువు



**నాణ్యతతో గడువు లోగా పూర్తి చేయాలి**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**రూ. 3.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం**

**రూ. 33 కోట్లతో రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారుల అనుసంధాన పనులకు భూమిపూజ**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** క్షేత్ర స్థాయిలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో గడువులోగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముదిగొండ ..మిగతా 2లో

# ఉద్యమ చరిత్ర యువతకు స్ఫూర్తి

**సంగారెడ్డిలో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ**

**ఉచిత విద్య, ఉచిత వైద్యమే లక్ష్యం**

**కల్వకుంట్ల కవిత**





**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కలబ్ గుర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ..మిగతా 2లో

# రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**రైతులపై ఒత్తిడి చేస్తే చర్యలు..**

**యూరియాతో ఇతర ఉత్పత్తుల విక్రయాలకు బ్రేక్**

**నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, అక్షిత న్యూస్ :** నిజామాబాద్ జిల్లాలో యూరియా లేదా ఇతర ఎరువులు కొనుగోలు చేసే రైతులను వారి అంగీకారం లేకుండా నానో యూరియా లేదా ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం ..మిగతా 2లో





# పకడ్బందీగా నీట్ పరీక్ష

**నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు**

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో జూన్ 21 న నిర్వహించనున్న నీట్-2026 రీ ఎగ్జామ్ పరీక్ష కు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ..మిగతా 2లో

## స్వంతింటితో నెరవేరిన స్వప్నం



**మొదటి పేజీ తరువాయి...**

వినూత్న కార్యక్రమానికి అధికారికంగా ఆదివారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. ఇందులో భాగంగా నియోజక వర్గంలో ప్రతి వారం రోజులలో ఐదు రోజుల పాటు ఎమ్మెల్యే స్వయంగా పల్లెనిద్ర చేసి పర్యటించనున్నారు. ఆమనగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జనం మాట–పల్లెబాట అధికారిక పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్, ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి, డిఎస్పి కె.రాజశేఖర్ రాజుతో కలిసి ఆవిష్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన 14 ఇందిరమ్మ ఇళ్లను వారు రిబ్బన్ కట్ చేసి, లబ్ధిదారులతో కలిసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు.సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వ్యక్తమైంది. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆమనగల్లు గ్రామంలో శనివారం రాత్రి బస చేశారు. అధికారులతో కలిసి పల్లెనిద్ర చేస్తూ గ్రామస్తులతో సుదీర్ఘంగా ముచ్చటించారు. వీధి వీధినా తిరుగుతూ తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, రోడ్ల వంటి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధి స్వయంగా తమ గ్రామానికి వచ్చి రాత్రి వేళల్లో బస చేసి సమస్యలు వినడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాట్లాడుతూ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రజల కష్టసుఖాలను నేరుగా క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికే జనం మాట–పల్లెబాటను ప్రారంభించామన్నారు.

వారంలో ఐదు రోజులు మీ మధ్యే ఉంటా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు పనిచేస్తామన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో సేకరించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిరుమరి కృష్ణయ్య, డి.స్కైలాబ్ నాయక్, మాలి కాంతరెడ్డి, మండల ఎంపిడిఓ జితేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా ఎరువులు కొనుగోలు చేసేందుకు వచ్చే రైతులను కొంతమంది ఎరువుల దుకాణాదారులు ,వివిధ సంస్థల ప్రతినిధులు నానో యూరియా తదితర ఉత్పత్తులు కూడా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందన్నారు. రైతులు కోరిన ఎరువులను మాత్రమే వారికి అందించాలని, యూరియా విక్రయాలను ఇతర ఉత్పత్తులతో ముడిపెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సమంజనం కాదని పేర్కొన్నా రు. రైతులపై ఎలాంటి బలవంతం చేయకుండా నిబంధనలకు అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ రైతులను ఎవరైనా ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# అంతర్గత రోడ్లతో ప్రయాణం సులువు

**మొదటి పేజీ తరువాయి...**



మండలంలోని యడవల్లి గ్రామంలో రూ.3.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ముదిగొండ మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించను న్న ఈఆర్వో కార్యాలయ భవనానికి, మండలం లో రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రహదారుల అభివృద్ధి పనులకు కూడా ఉప ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా పరిసర గ్రామాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని, గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ భవనం భవనం ఉపయోగ పడనుందని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సంబంధిత సేవలు మరింత సులభంగా అందిం చేందుకు ఈఆర్ఓ భవనం దోహదపడనుందని అన్నారు.ముదిగొండ మండలంలో 33 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణం పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు జాతీయ రహదారులతో అనుసంధానం బలోపేతం కానున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస రెడ్డి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ సుడా ఛైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా నీట్ పరీక్ష



**మొదటి పేజీ తరువాయి...**

ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు,ఎస్.పి.లు ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్–2026 రీ ఎగ్జామ్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్–2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.

పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు.

# ఉద్యమ చరిత్ర యువతకు స్ఫూర్తి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించి సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాకు చారిత్రక ప్రాధాన్యం ఉందని, 1969 తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం కీలక కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆ ఉద్యమ చరిత్రను నేటి యువత తెలుసుకుని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నించిన వారికి తెల్లాపూర్ ప్రాంతం సజీవ సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్న ఆమె, తెలంగాణ రక్షణ సేన ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పేదలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తమ పార్టీని స్థాపించాల్సి వచ్చిందని కవిత అన్నారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలించిన ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేవని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పిల్లలకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని హక్కుగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటను తప్పబోమని, సంక్షేమ పాలన అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సింగూర్ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించిన ఆమె, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాంత అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని సూచించారు. ప్రాంతీయ సమస్యల పరిష్కారానికి ప్రాంతీయ పార్టీ అవసరమని, ప్రజలు తెలంగాణ రక్షణ సేనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బాలయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కరుణాకర్, నితిన్, శ్రీకాంత్, కేడీఆర్ యువసేన అధ్యక్షుడు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత అసంఘటిత కార్మికులకు అండగా ఉంటాం

### ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** శ్రీ చైతన్య ఆటో కార్మిక పరస్పర సహకార సంఘనికి పూర్తి సహాయ సహకారాలు, వ్యక్తిగత తోడ్పాటును అందించానని, భవిష్యత్తులో కూడా అందిస్తానని వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచీకరణ కారణంగా సంఘటిత అసంఘటిత కార్మికుల జీవితాలు ఆగం అయ్యాయి అని,ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఈ సందర్భంగా తెలియజేశారు. కేసీఆర్ పాలన్లో ఆటో కార్మికులకు 77 కోట్ల టాక్స్ లను మాఫీ చేసి,ఆటో కార్మికులకు 5 లక్షల ప్రమాద బీమా చేయించి అండగా నిలిచారని తెలిపారు

ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేలు,ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ 2023లో ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు మరిచారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు




రాబోవు రోజులలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో సహకార, కార్మిక సంఘాల కోసం ప్రత్యేక ప్రభుత్వ పాలసీలను రూపొందిస్తామని తెలిపారు.ఆదివారం నుంచి 10 రోజుల పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ వారీగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, ఇమ్మడి రాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు ఉప్పుల రాజేందర్, రామ్ చందర్, రవీందర్, సురేష్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

### తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రోగులకు, కార్మికులకు పండ్లు పంపిణీ




**వరంగల్, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులను ముందుకు నడిపించిన, డాక్టర్ మామిడి సోమయ్య 61వ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచం మైదాన్ లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతూ వారి హక్కుల సాధనకై నిరంతరం తెలంగాణ ఏర్పాటులో సైతం జర్నలిస్టుల వాలిని అప్పటి ప్రభుత్వాలకు కళ్ళు తెరిపించి తెలంగాణ జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని ముందు వరుసలో నిలిపిన మామిడి సోమయ్య జర్నలిస్టు సమాజం మరువదని ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయకుమార్ అన్నారు. భవిష్యత్తులో కూడా నిత్య నూతనంగా వారి సేవలు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల స్వామిదాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్, సహాయ కార్యదర్శి రాంపల్లి శ్రీనివాసచారి, సభ్యుడు పెండేల శీను, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో భారీ ఎత్తున నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి :** నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి పోలీసులు హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి, విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (36) వద్ద నుండి అంబర్ , గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ.1,92,000 ఉంటుందన్నారు.స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని , స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు..

# సికింద్రపూర్ పెద్దమ్మ కాడి తండా గ్రామంలో ఐక్య మహిళ సంఘాల వీఓ భవనానికి భూమి పూజ



**భీంగల్ , అక్షిత న్యూస్ :** బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ మండలం సికింద్రపూర్ పెద్దమ్మ కాడి తండా గ్రామంలో ఈరోజు ఐక్య మహిళా సంఘాల వీఓ భవనం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకు ఇలాంటి వీఓ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్, టౌన్ ప్రెసిడెంట్ పర్సా అనంతరావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అరిగేలా జనార్ధన్, సర్పంచ్ రమేష్, ఉపసర్పంచ్ గణపతి, వాక మహేశ్ మరియు మహిళలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి జె.ఎస్.ఆర్.ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణం 15 వ వార్డుకు చెందిన జె.మనెమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న "జె. ఎస్.రాములు ఫౌండేషన్" స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, పూలమాలతో నివాళు లర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం సంస్థ నిర్వాహకులు నాలుగు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు జే.భక్తరాజు, జే.అమృత రాజు, మహిమ రాజు, సతీష్ రాజు, శ్యాం కుమార్, కర్ణ కుమార్, హెబ్రోన్ చర్చ్ పాస్టర్ ఇమ్మానియేల్, పి.శేఖర్ ,మాజీ వార్డు సభ్యులు సుభాష్, ఎన్.ప్రదీప్ కుమార్, జేఏసీ నాయకులు కిరణ్, ప్రసాద్, మేస్త్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐ మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**తొర్రూర్, అక్షిత బ్యూరో:** తొర్రూర్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంగలపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ టీసీ అంజయ్య, టౌన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, సీనియర్ నాయకుడు మరియు ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, ధారవత్ జైసింగ్ నాయక్, కౌన్సిలర్లు జంపన్న, తూర్పాటి రవి, సింగిల్ విండో డైరెక్టర్లు జాటోత్ టీకు నాయక్, ధారవత్ బాలునాయక్, సీనియర్ నాయకులు 6వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు రాయిశెట్టి వెంకన్న, మాజీ కౌన్సిలర్ గుగులోత్ శంకర్, మాజీ సర్పంచ్ జాటోత్ రమేష్ నాయక్, బాలునాయక్, బొలగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపూర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీలో రూ.17 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రామచంద్రపూర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం రాకపోకలు సులభతరం కావడంతో పాటు స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మేధన్స్ ఫుడ్ జోన్ ను ప్రారంభించిన టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి, తిలక్



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం నగర ప్రజలకు సరికొత్త రుచులను ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి మేధన్స్ ఫుడ్ జోన్ సిద్ధమైంది. ఖమ్మం నగరం గుట్టల బజార్ కిన్నెరసాని థియేటర్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్‌ను తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తో పాటు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, యర్రం బాలగంగాధర్ తిలక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హోటల్‌ను ప్రారంభించిన అనంతరం యర్రం బాలగంగాధర్ తిలక్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల చొరవతో ఖమ్మం నగరం రోజురోజుకూ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పెరుగుతున్న జనాభా నగర విస్తరణకు అనుగుణంగా ఇలాంటి ఆధునిక వసతులతో కూడిన హోటళ్లు రావడం శుభపరిణామన్నారు. వ్యాపార రంగాలు విస్తరించడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఖమ్మం నగర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు కేవలం ఆహారాన్ని రుచిగా అందించడమే కాకుండా నాణ్యత శుభ్రత పాటించినప్పుడే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. మేదాన్స్ ఫుడ్ జోన్ నిర్వాహకులు కూడా అదే బాటలో పయనించి కస్టమర్ల మనసులు గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు శ్రీనివాసరావు బాలగంగాధర్ తిలక్ మేధన్స్ ఫుడ్ జోన్ యొక్క ప్రొప్రైటర్స్ కూచిపూడి శ్రీనివాసరావు కూచిపూడి ఉదయ్ కుమార్ ను అభినందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు జిల్లా కార్యదర్శి కొనిదన శ్రీనివాస్ అసోసియేషన్ అధ్యక్షులు కోమగిఈట దుర్గ ప్రసాద్ జాయింట్ సెక్రటరీ వల్లూరి శ్రీకాంత్ కోటపాటి రుక్మారావు జిల్లా సెక్రటరీ కాంగ్రెస్ పార్టీ డి శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచిపూడి ముద్దు కృష్ణ మెట్టు సల్మాన్ కూచిపూడి ప్రవీణ్ కుమార్ కూచిపూడి ఉపేందర్ దేవరకొండ ఫణి సురవెల్లి శ్రీనివాస్ కలకోట వెంకన్న వెంపటి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ ఉద్యోగాల ఎంపికలో వస్తున్న మార్పులకు

# అనుగుణంగా శిక్షణ

### డిల్లీ డిఫెన్స్ అకాడమీ అధినేత కొత్త సతీష్ రెడ్డి




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఇండియన్ ఆర్మీ ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న పరీక్ష విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమ విద్యా సంస్థ ప్రత్యేక శ్రద్ధకనబరుస్తుందని డిల్లీ డిఫెన్స్ అకాడమీ సంస్థ అధినేత కొత్త సతీష్ రెడ్డి తెలిపారు. గత నెల 30 న విడుదల అయిన ఇండియన్ ఆర్మీ ఫలితాలలో డిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాలలో ఉద్యోగాలు సాధించిన నేపథ్యంలో విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిల్లీ డిఫెన్స్ అకాడమీ అధినేత కొత్త సతీష్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థ నుండి ఇండియన్ ఆర్మీలో 193 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ విభాగంలో 157 మంది విద్యార్థులు, అగ్నివీర్ టెక్నికల్ విభాగంలో 17 మంది విద్యార్థులు, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ విభాగంలో 14 మంది విద్యార్థులు, అగ్నివీర్ క్లర్క్ 1, ఎయిర్ ఫోర్స్ విభాగంలో 4 మంది విద్యార్థులు జే.శన్ముఖ్ సాయి రాజ్, ఎ.చరణ్ తేజ్, ఎస్.శ్రిజ, పి.మధుమిత లు డిల్లీ డిఫెన్స్ అకాడమి విద్యా బోధన, శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించడం జరిగిందని వెల్లడించారు. అభ్యర్థుల ఎంపిక విధానంలో మారుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమ విద్యా సంస్థ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. విద్యార్థులకు ప్రశ్నల సరళిపై, కఠినతా స్థాయిలపై అవగాహన పెంపొందేలా ప్రతిరోజు పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారి అభ్యాసనా సామర్థ్యాలు పెంచుకునేలా, వారిలోని లోపాలు తెలుసుకుని సవరించుకునేలా గ్రాండ్ టెస్టులని నిర్వహిస్తూ పరీక్షల్లో విజయం సాధించేలా డిల్లీ డిఫెన్స్ అకాడమీ తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఒక స్పష్టమైన , నిర్దిష్టమైన లక్ష్యం వుండాలని, దానికోసం నిరంతరం కృషి చేయాలని, చేసే పనిని తపస్సుతో భావించినపుడే ప్రతి ఒక్కరు విజయం సాధిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ లక్ష్యాలపై దృష్టి పెట్టేలా వాటి సాధనకై నిరంతరం కృషి చేసేలా ప్రోత్సహిస్తూ వారి పరీక్షలకి అనుగుణంగా శారీరక, మానసిక అభ్యాసాలని విద్యార్థులకి అందిస్తుండడం వలన తమ అకాడమీ విద్యార్థులు రాత, శారీరక పరీక్షల్లో విజయం సాధిస్తున్నారన్నారు. ఇంత గొప్ప విజయాన్ని అందించేందుకు కృషి చేసిన అధ్యాపక బృందానికి, సిబ్బందికి ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యున్నత భోధనా ప్రమాణాలతో శిక్షణని అందిస్తూ అన్ని ఆర్మీ ర్యాలీలలో అద్భుత విజయాలు నమోదు చేస్తున్న డిల్లీ డిఫెన్స్ అకాడమీలో సైనిక ఉద్యోగాల ఆశావహులు, నిరుద్యోగులు చేరి ఉద్యోగులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.




### బాల కార్మికులను

## పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం

### బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098కు ఫోన్ చేయండి




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ పట్టణంలోని ఎ-వన్ చికెన్ సెంటర్‌లో బాల కార్మికులు పనిచేస్తున్నారని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత సేవకు సమాచారం అందింది. వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ సంపత్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సృజన్ రెడ్డి సహకారంతో డీసీపీఓ పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, పోలీస్ స్పెషల్ టీమ్ మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంబంధిత షాపును సందర్శించారు. ఈ సందర్భంగా యజమానికి బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించి, కౌన్సిలింగ్ నిర్వహించారు బాలుడిని వెంటనే పాఠశాలలో చేర్పించాలని సూచిస్తూ వార్నింగ్ ఇచ్చారు అధికారులు మాట్లాడుతూ, బాల కార్మికులు ఎక్కడైనా కనిపించినా లేదా బాలల హక్కులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

### పాఠశాల భవనం శిథిలం

## విద్యార్థులు చదువుకునేది ఎలా..?

### వెంటనే ప్రభుత్వ భవనం మంజూరు చేయాలి





**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం మలోని చెరువు తండా గ్రామంలో పాఠశాల భవనము స్థితుల వ్యవస్థలో చేరుకుంది. వర్షం వచ్చిందంటే విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నది. గత రెండు సంవత్సరాల క్రితం అదనపు తరగతుల నిమిత్తం 7 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. అట్టి నిధులు సరిపోక మధ్యలోనే పిల్లర్లు లేపి నిలిచి వేశారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి చదువుకోవాలంటే ఒకే ఒక గది స్థిర వ్యవస్థలో చెర్రీ పైకప్పు పెచ్చులు ఊడుతుంది. ఎప్పుడు ఆభవనం కూలిపోతుందోనని విద్యార్థులు ఉపాధ్యాయులు భయంతో చెందుతున్నారు.

రాబోయేది వర్షాకాలం. మరి విద్యార్థులు పాఠశాలకు వెళ్లి ఎలా చదువుకోవాలి అంటూ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. మారుమూల గ్రామంలో ఉన్న గిరిజన తండాకు ఎందుకు ఇంత అలసత్వం అంటూ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా మండల జిల్లా అధికారులు స్పందించి పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఐఐటీ హైదరాబాద్‌కు వాహన రహిత ఆదర్శ ప్రాంగణంగా

# ఫిట్ ఇండియా గుర్తింపు

### ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న 200 మంది



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఐఐటీ) హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో 200 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, ప్రాంగణ నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా సుస్థిర రవాణా విధానాలను ప్రోత్సహిస్తూ వాహన రహిత ప్రాంగణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు ఫిట్ ఇండియా ఉద్యమం ఐఐటీ హైదరాబాద్‌ను ఆదర్శ ప్రాంగణంగా గుర్తించి సత్కరించింది. ఫిట్ ఇండియా చేపట్టిన ఆదివారాలు సైకిల్‌తో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీ ఎస్ఎన్‌సీసీ క్రీడా సముదాయం నుంచి ప్రారంభమై, 600 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఐఐటీ ప్రాంగణంలోని సుందర మార్గాల మీదుగా సాగింది. ఐఐటీ హాఫ్ మారథాన్‌లో ఉపయోగించే మార్గంలో నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా సైక్లింగ్‌ను ఆరోగ్యకరమైన, పర్యావరణహితమైన, సుస్థిర రవాణా సాధనంగా ప్రజల్లో ప్రోత్సహించారు. ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్ ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో నిర్వహించే









ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిట్ ఇండియా ఉద్యమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ సుస్థిర రవాణా విధానాలను అమలు చేయడం, పర్యావరణహిత ప్రయాణాలను ప్రోత్సహించడం, వాహన రహిత ప్రాంగణ నమూనాను విజయవంతంగా అమలు చేయడాన్ని ఫిట్ ఇండియా ప్రత్యేకంగా ప్రశంసించింది. దేశంలోని ఇతర విద్యాసంస్థలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొంది. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, శారీరక ఆరోగ్యం, పర్యావరణ బాధ్యత, విద్యా నాణ్యత పరస్పరం అనుసంధానమై ఉండాలని తమ సంస్థ విశ్వసిస్తోందన్నారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, ఫిట్ ఇండియా నుంచి లభించిన ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఐఐటీ క్రీడల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ హిమాన్షు జోషి మాట్లాడుతూ, ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీలో కనిపించిన ఉత్సాహం ప్రాంగణంలో ఆరోగ్యం, సుస్థిర జీవన విధానంపై పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమన్నారు. ప్రతి వారం నిర్వహించే ఆదివారాలు సైకిల్‌తో కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర అలవాట్లను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా ఐఐటీ హైదరాబాద్ ఫిట్ ఇండియా సైకిల్ కార్యక్రమాలు, సైక్లోథాన్‌లు, మారథాన్‌లు, అంతర ఐఐటీ సిబ్బంది క్రీడా పోటీలు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రతి వారం నిర్వహించే సైకిల్ కార్యక్రమాల ద్వారా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరూ సైక్లింగ్‌ను తమ జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన, పర్యావరణహిత భారత నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ముస్సోరీ ఎల్బీఎస్ఎన్ఏఏ "గుడ్ గవర్నెన్స్" కార్యక్రమానికి మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో గల 'లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ పరిపాలన అకాడమీ' వేదికగా ప్రతిష్టాత్మక నిర్వహించే ప్రత్యేక ఉన్నత స్థాయి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఎంపికయ్యారు. జూన్ 8 నుండి 13 వరకు వారం రోజుల పాటు జరిగే "గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్" (క్షేత్ర స్థాయి నిర్వాహాకుల సుపరిపాలన) కార్యక్రమంలో పాల్గొననున్నారు. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిపాలన ఉన్నత స్థాయి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం నుండి సమర్థవంతమైన ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఎంపిక చేసింది. ఇందులో కరీంనగర్ నగరపాలక సంస్థ ఐఏఎస్ అధికారులైన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ మంద మకరందు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి. రాహుల్ కు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. " గుడ్ గవర్నెన్స్ ఫర్ ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ " కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయి పరిపాలనలో ఉత్తమ విధానాలు, పారదర్శకత, ప్రజలకు మరింత మెరుగైన పాలన, వేగవంతమైన సేవలు అందించడం, మున్సిపల్ వ్యవహారాల్లో సరికొత్త సంస్కరణలు తీసుకురావడం పై కార్యక్రమంలో వారం రోజుల పాటు వివరించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం " గుడ్ గవర్నెన్స్ " కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎంపిక చేయడం హర్షనీయమన్నారు. ఉన్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంబంధిత కార్యక్రమ ఎజెండా అంశాల ఆధారంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రజలకు క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన పాలన, సరికొత్త అభివృద్ధి సంస్కరణలు ఎంతగానో దోహదపడుతాయని వెల్లడించారు.

## సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష. షేక్.



**గద్వాల అక్షిత న్యూస్:** ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలోభాగంగాసోమవారంగ్రామవార్డు,గ్రామ,సభలనిర్వహణ,ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ఇంటెన్సివ్,రివిజన్,కార్యక్రమాలలోఅధికారులుఅందరూపాల్గొంటున్నందునజూన్08. 2026సోమవారంనిర్వహించేప్రజావాణికార్యక్రమాన్ని తాత్కాలికంగారద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలందరూఇట్టివిషయాన్నిగుర్తించిసోమవారంకలెక్టర్,వారి కార్యాలయానికివచ్చిఅసౌకర్యానికి గురికాకూడదుఅని కోరారు. తదుపరి వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు యధావిధిగానిర్వహించడంజరుగుతుందనిజిల్లాకలెక్టర్ అన్నారు.

## శేరిలింగంపల్లి అభివృద్ధిపై

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలి

### ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల కోసం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కొత్త హామీలు ఇవ్వడానికి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తింపు పొందిందన్నారు. ఐటీ రంగ విస్తరణ, ఫ్లైఓవర్లు, రోడ్ల అభివృద్ధి, మిషన్ భగీరథ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి కార్యక్రమాలతో శేరిలింగంపల్లి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలా కాలం గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిస్థాయి పురోగతి కనిపించడం లేదన్నారు. మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, మౌలిక వసతుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు, రోడ్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయకుండా కొత్త శంకుస్థాపనలు చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని పేర్కొన్నారు.

అలాగే శేరిలింగంపల్లి రాజకీయాల గురించి మాట్లాడే ముందు స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా అరికేపూడి గాంధీ గారు ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో ఉన్నారో, ఆయన రాజకీయ వైఖరి ఏమిటో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పార్టీ మార్పులు, రాజకీయ అవకాశవాదం గురించి మాట్లాడే నాయకులు ముందుగా తమ వైఖరిని ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని అన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు రాజకీయ ప్రసంగాల కోసం కాకుండా అభివృద్ధి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ప్రజలకు జవాబు చెప్పాల్సిన సమయం వచ్చింది. శంకుస్థాపనల కంటే హామీల అమలే ముఖ్యమని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి. శేరిలింగంపల్లి ప్రజలకు వాస్తవాలు చెప్పి, అభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. ఉద్యమకారుడు శేరిలింగంపల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిర్రా రవీందర్ డిమాండ్ చేసారు.

# కల్కి భగవాన్ కల్యాణోత్సవంలో పాల్గొన్న జగ్గారెడ్డి



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సంగారెడ్డి పట్టణంలో పిఎస్ఆర్ గార్డెన్ లో కల్కి భగవాన్ భక్త బృందం ఆధ్వర్యం లో కల్కి భగవాన్ మూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. కల్కి భగవాన్ దంపతుల విగ్రహ మూర్తులకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కల్కి భగవాన్ కృపా కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని , ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ఆకాక్షించారు. ప్రతీ ఏటా క్రమం తప్పకుండా కల్యాణం నిర్వహిస్తున్న కల్కి భగవాన్ భక్త బృందాన్ని ఆయన అభినందించారు. కల్కి భగవాన్ ఆలయ కోసం స్థలాన్ని సేకరించామని , ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణం కోసం తన పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా కల్కి భక్త బృందానికి జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కల్కి భక్త బృంద సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కోతకు గురైన చెరువు కట్ట.. వాహనాలు నడిచేది ఎలా?

**రహదారి బాగు చేయండి బస్సు నడిపే విధంగా చూడండి**

**లింగాల నుండి రాయవరంకు బస్సు లేక ప్రజలు ఇబ్బందులు**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల మండలం రాయవరం నుండి లింగాలకు వచ్చే రహదారిలో దారారం గ్రామం సమీపంలో చెరువు కట్ట కోతకు గురి కావడంతో బస్సు ఆ కట్టపై వెళ్లాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బస్స నడపాల్సి పరిస్థితి వెలకొద్దీ. దారారం. క్యాంపు రాయవరం. రాయవరం గ్రామాల సర్పంచులు శనివారం గ్రామసభ ఉండడంతో గ్రామ ప్రజలు మరియు సర్పంచులు పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. వారి స్పందిస్తూ 50 ట్రిప్పుల దాకా మొరం కొట్టాలని సర్పంచులకు ఏ ఈ తెలియజేశారు. సర్పంచులు స్పందిస్తూ వెంటనే వరకు మొరం కొట్టి రహదారి బాగు చేసేందుకు కృషి చేస్తామని సర్పంచులు గ్రామ సభలో తెలియజేశారు.

# అప్పాపూర్, బౌరాపూర్ గ్రామాలలో చట్టాలపై అవగాహన

**నాగర్ కర్నూల్ డీఎల్ఎస్ఎ జడ్జి శ్రీదేవి**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని అప్పాపూర్ బౌరాపూర్ గ్రామాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇట్టి సదస్సుకు నాగర్కర్నూల్ డిఎల్ఎస్ఎ జడ్జి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా పిల్లలను చదివించాలని విద్య హక్కు చట్ట ప్రకారం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని. పెరుకబడిన చెంచు కుటుంబాల పిల్లలకు ప్రత్యేక ఐటిడిఏ ద్వారా పాఠశాలలో నెలకొల్పిందని, మహిళా చట్టాలు .బాలల చట్టాల. పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు వీరేష్. లింగాల ఎస్సై చంద్రకాంత్. కోర్టు కానిస్టేబుల్ ఉషన. బాల్రాజ్. మాల్యా నాయక్. మాజీ సర్పంచ్ బాల గురువయ్య. తదితరులు పాల్గొన్నారు.

# గందరగోళంలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ

**నాలుగు నెలలు గడుస్తున్న అర్హులకు అందని అక్రిడేషన్ కార్డులు**

**కొన్ని జిల్లాల్లో పెత్తనం చెలాయిస్తున్న అక్రిడేషన్ కమిటీ సభ్యులు. అన్ని అర్హతలు ఉన్న వారిని సైతం పక్కన పెడుతున్న వైనం**

**ఇదే అదనుగా జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేస్తున్న జిల్లా అధికారులు**

**అన్ని అర్హతలు ఉన్నవారికి అక్రిడేషన్ కార్డులు అందించేందుకు కమిటీ సభ్యులకు అధికారులకు వచ్చిన ఇబ్బందులు ఏమిటి**

**కొన్ని జిల్లాల్లో అన్ని అర్హతలు ఉన్నా, పైసలిస్తేనే కార్డులు ఇస్తామంటున్న కమిటీ సభ్యులు**




**వరంగల్, అక్షిత బ్యూరో:** అక్రిడిటేషన్ కార్డుల పంపిణీలో గందరగోళం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు తమకు సంబంధం లేకపోయినా అనవసరపు విషయాల్లో తలదూరుస్తూ తమకు అనుకూలమైతే మద్దతు తెలుపుతూ తమకు అనుకూలం కాకపోతే అన్ని అర్హతలు ఉన్న జర్నలిస్టులకు కార్డులు ఇవ్వడంలో సుముఖత వ్యక్తం చేయకపోవడం పట్ల అర్హతలు ఉన్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంది.

నిబంధనలు అర్హతలు సక్రమంగా చూసి జీవో ప్రకారం పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా నిబంధనల ప్రకారం అక్రిడేషన్ కార్డుల ప్రక్రియ పరిశీలించవలసిన జిల్లా కమిటీ అధికారులు సైతం ఈ విషయాల పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపక తత్సారం చేయడం వెనుక మతలబు ఏమి దాగుందని అన్ని అర్హతలు ఉండి కార్డు పొందని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది సర్కులేషన్, సర్వీస్, రికమండేషన్ లెటర్, విద్యార్హత, పత్రిక ప్రాధాన్యత మెయిన్, మీడియం, స్మాల్, ఈ రకంగా మూడు విభాగాలుగా విభజించి పత్రిక సర్కులేషన్ ప్రకారం అక్రిడేషన్ కార్డులను జారీ చేయనున్నది. ఈ క్రమంలో పత్రికా యాజమాన్యం ఇచ్చే ధ్రువపత్రాలు చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా ఇవ్వబడిన వివరాలు ఆర్ఎన్ఐ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చేటువంటి మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసి ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది

కానీ జూన్ నెల గడుస్తున్న నోటిఫికేషన్ వచ్చి నాలుగు నెలలు పూర్తయినప్పటికీ ఇంకా జర్నలిస్టులకు కార్డులు ఇవ్వకపోవడం పట్ల అర్హులైన జర్నలిస్టులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలపై జిల్లా చైర్మన్గా ఉన్న జిల్లా అధికారి చైర్మన్ కలెక్టర్, కన్వీనర్ జిల్లా పౌర సంబంధాల అధికారి, వివిధ యూనియన్లకు సంబంధించిన ప్రతిపాదిత జర్నలిస్టు సభ్యులు ఇటువంటి విషయాల పట్ల జర్నలిస్టులకు హక్కులకు భంగం కలగకుండా అర్హత గల జర్నలిస్టులందరికీ వెంటనే కార్డులు ఇప్పించి అర్హత లేని వారి లోపాలు ఏమిటో చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని అర్హత గల జర్నలిస్టులు ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. కొంతమంది అర్హత లేని వారి వల్ల మిగతా వారందరికీ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉన్నదని అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా ఉన్నవారు ఇదేదో అధికారిక కార్యక్రమమనుకుని విర్రవీగకుండా తాత్కాలికమైన ఈ పదవిని అధికారం అనుకోకుండా జర్నలిస్టులందరికీ న్యాయం చేసేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తాం**

**నూతన అధ్యక్షుడు బత్తెపు శేఖర్**





**వలిగొండ/అక్షిత న్యూస్:** వలిగొండ మండలం లోని వెల్వర్తి గ్రామంలో ఏడు సంవత్సరాల తర్వాత నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలలో గెలుపొందిన పాలకవర్గానికి ఆదివారం రోజున ఎన్నికల అధికారి కుర్ర సురేష్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో నూతన అధ్యక్షుడిగా బత్తేపు శేఖర్, ఉపాధ్యక్షుడిగా మారబోయిన పరుశురాం, కార్యదర్శిగా సురబోయిన దయాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా నిమ్మల శేఖర్, దుడ్డు ఆంజనేయులు, బొల్లెబోయిన శేఖర్, మారబోయిన అంజయ్య, దుడ్డు అండాలు, చెవ్వ ఎల్లమ్మలు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించినందుకు సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేసి ముందు వరుసలో నిలుపుతామని వారు తెలియజేశారు.ముదిరాజ్ సమాజ సంక్షేమం, అభివృద్ధి, ఐక్యత మరియు సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం నూతన నాయకత్వం కృషి చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా "నియంతృత్వ పాలనకు ముగింపు -- ప్రజాస్వామ్యానికి పట్టం కట్టిన వెల్వర్తి ముదిరాజ్ ఐక్యత" అనే నినాదంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, చెవ్వ కృష్ణ, చెవ్వ బిక్షపతి, మారబోయిన బిక్షపతి, సారగండ్ల రాజు, దుడ్డు రమేష్, కాల్వల లింగస్వామి, చెవ్వ మధు, దాసబోయిన వెంకటేశం, దుడ్డు నవీన్, బొల్లబోయిన మధు, నిమ్మల సురేష్, నిమ్మల నవీన్, దుడ్డు గణేష్, బొల్లబోయిన వంశీ, మారబోయిన అనిల్, సారగండ్ల ఉదయ్ ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పీఎంజే జువెలరీ షాప్ దోపిడీ కేసులో
# ముగిసిన నిందితుల పోలీస్ కస్టడీ

**ఆయుధాలు, మొబైల్ రికవరీ**

**బీహార్‌లో మరో కీలక నిందితుడు అరెస్ట్**

**వివరాలు వెల్లడించిన కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం**



కరీంనగర్ అక్షిత బ్యూరో: పీ.ఎం.జే జువెలరీ షాప్ దోపిడీ కేసులో ముగ్గురు ప్రధాన నిందితుల పోలీస్ కస్టడీ ముగిసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ అలం వెల్లడించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పీఎంజే జువెలరీ షాప్ దోపిడీ కేసు దర్యాప్తులో భాగంగా ముగ్గురు ప్రధాన నిందితులను పోలీసులు నాలుగు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. 03 వ తేదీ ఉదయం 11:00 గంటల నుండి 07 తేదీ ఉదయం 10:30 గంటల వరకు ఈ పోలీస్ కస్టడీ కొనసాగింది. పోలీస్ కస్టడీలో ఏ-1 సుబోధ్ సింగ్ తండ్రి ఈశ్వరి ప్రసాద్ సింగ్, నివాసం చిష్టిపూర్ గ్రామం, చాందీ పిఎస్, నలందా జిల్లా, బీహార్, ఏ-2 రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్ వయస్సు 41, నివాసం ఆసన్సోల్ సౌత్ పిఎస్, పశ్చిమ బర్ధమాన్ జిల్లా, పశ్చిమ బెంగాల్, ఏ-3 రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ వయస్సు 23, నివాసం హిల్సా మండల్, నలందా జిల్లా, బీహార్ ఈ ముగ్గురిని విచారించినట్లు సీపీ తెలిపారు. పోలీస్ కస్టడీ సమయంలో పంచుల (సాక్షుల) సమక్షంలో నిందితులను సుదీర్ఘంగా విచారించగా, కీలకమైన ఆయుధాలు, మొబైల్ ఫోన్ రికవరీ అయ్యాయి. నిందితులు ఏ-2, ఏ-3 లు ఇచ్చిన సమాచారం మేరకు, వారిని వెంటబెట్టుకుని వెళ్ళగా వెలిచాల బైపాస్ రోడ్ వద్ద గల చెట్ల పొదలలో దాచి ఉంచిన, నేరానికి ఉపయోగించిన రెండు (02) పిస్టల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తప్పించుకుపోయిన మార్గమైన ధర్మపురి వైపు విచారణ జరపగా, మద్దునూరు గ్రామ పరిధిలోని బగ్గారం మండల అటవీ ప్రాంతం సమీపంలో నేరానికి సంబంధించిన ఒక వివో కంపెనీ (వెండి -- గులాబీ రంగు) మొబైల్ ఫోన్‌ను గుర్తించి, పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగింది. విచారణలో కొంత సమాచారం సేకరించినప్పటికీ, నిందితులు పూర్తిస్థాయిలో పోలీసులకు సహకరించలేదు. దొంగిలించిన సొత్తు (బంగారు,వజ్రాల ఆభరణాలు) ఎక్కడ దాచారు అనే విషయాన్ని, ఎవరికి విక్రయించారు అనే విషయాన్ని,ఎవరెవరికి ఆర్థిక లావాదేవీలు జరిగాయనే కీలక సమాచారాన్ని నిందితులు ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నట్టు పేర్కొన్నారు.ఆభరణాల దాచివేత, రవాణా విషయాలపై నిందితులు పరస్పర విరుద్ధమైన, తప్పుదారి పట్టించే వాంగ్మూలాలు ఇచ్చారు. ముఖ్యంగా, గతంలో గుండాల అటవీ ప్రాంతంలో సొత్తు దాచినట్లు చెప్పిన ఏ-2 (రఘునాథ్ కర్మాకర్), ఇప్పుడు ఆ సమాచారం నుండి వెనక్కి తగ్గాడు. కేసును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించడానికే నిందితులు ఇలా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో, నిందితులను మరికొన్ని రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానంలో ప్రత్యేకంగా రిక్విజిషన్ దాఖలు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.ఇదే కేసులో పరారీలో ఉన్న మరో కీలక నిందితుడి (ఏ-10) అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు.ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ బృందం ఒక భారీ విజయాన్ని సాధించినట్లు వివరించారు. ఈ నెల 4 వ తేదీన బీహార్ రాష్ట్రం, పాట్నా జిల్లాలోని సలింపూర్‌లో ఏ-10 నిందితుడైన అమర్‌సింగ్ అలియాస్ పహిల్వాన్ అలియాస్ అమరేంద్ర కుమార్ సింగ్ తండ్రి దివంగత రమేశ్వర్ సింగ్, వయస్సు 43 సం. నివాసం రూపాస్ మహాజీ, సలింపూర్ పీఎస్ ను




పోలీసులు విజయవంతంగా అరెస్ట్ చేశారని, నిందితుడిని అక్కడ స్థానిక న్యాయస్థానం ముందు హాజరుపరిచి, కరీంనగర్‌కు తీసుకువచ్చి ఇక్కడి న్యాయస్థానంలో ప్రవేశపెట్టడానికి పోలీసులు ట్రాన్సిట్ వారెంట్ పొందారని, ప్రస్తుతం ప్రత్యేక పోలీస్ బృందం నిందితునితో కలిసి కరీంనగర్‌కు ప్రయాణంలో ఉన్నట్లు తెలిపారు.ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.

# ప్రభుత్వం పించన్లు వెంటనే
# విడుదల చేయాలి

**ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలి**

**సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్**

అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా వేలాది మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సంబంధించిన పించన్లను మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు.

భూపాలపల్లి పట్టణంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు ..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించారని, కానీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు కొత్త పించన్ల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు.వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు జీవనోపాధి కోసం ప్రభుత్వ పించన్లపై ఆధారపడుతున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి పెండింగ్‌లో ఉన్న అన్ని పించన్లను




తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, హామీల అమలులో జాప్యం చేయడం ప్రజలను మోసం చేసినట్లేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రవీణ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఐ పార్టీ పట్టణ నాయకులు నేరెళ్ల జోసెఫ్, మహేశ్, గోలి లావణ్య , ఎండి సాబిర్, గోనెల తిరుపతి, శరత్, గడ్డం స్వరూప,పెద్దమాముల సంధ్య, పల్లెర్ల రజిత, పోతుగంటి స్వప్న, సుభద్ర తదితరులు పాల్గొన్నారు..

## 16 ఏళ్ల తర్వాత కలుసుకున్న ప్రభుత్వ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థినులు.....!

**ఆత్మీయ సమ్మేళనంలో తీపి జ్ఞాపకాల పంచుకోలు**





ఆర్మూర్,అక్షిత ప్రతినిధి: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 2009-2010 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థినులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న విద్యార్థినులు ఆనందోత్సాహాలతో తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి అప్పటి ప్రధానోపాధ్యాయురాలు కవిత ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, క్రమశిక్షణ, ప్రోత్సాహం వల్లే నేడు జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడగలిగామని పేర్కొన్నారు. పాఠశాలలో గడిపిన రోజులు జీవితంలో మరపురానివని, ఈ సమ్మేళనం ఆ జ్ఞాపకాలను మరోసారి సజీవం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కృష్ణవేణి, అరుణ, సంధ్యారాణి, శకుంతలాదేవి, అంబుజారాణి, నీరజతో పాటు విద్యార్థినులు విజేత, రమ్య, రవళి, రాజ్యలక్ష్మి, చౌల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి అందరినీ భావోద్వేగానికి గురిచేసింది.

## స్టేట్ బాక్సింగ్ సెలక్షన్స్‌కు ఎంపిక



మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : ఎన్బిఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 15 బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ సెలక్షన్స్ మిర్యాలగూడ ఎన్ఎస్పి రాజీవ్ గాంధీ అవుట్డోర్ స్టేడియం బాక్సింగ్ హాల్ లో ఆదివారం నిర్వహించారు. టోర్నమెంట్లో12 మంది బాలురు,3 బాలికలు ఈనెల 13.14న హైదరాబాద్ జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సెలెక్టయ్యారు. టోర్నమెంట్ ముఖ్య అతిథులుడిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, నాయకులు గుడిపాటి నవీన్ టోర్నమెంటును ప్రారంభించారు. డిఎస్ఎ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ బాక్సింగ్ కోచ్ ఈ.రవీందర్ గౌడ్, సెక్రెటరీ ఈ.ప్రవీణ్, బ్యాట్మెంటన్ కోచ్ రామకృష్ణ, జూడో కోచ్ శ్రీధర్, బాక్సింగ్ సీనియర్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

## ఫ్రెండ్ నాట్ ఎండ్ మూవీ షార్ట్ మూవీ పోస్టర్ ఆవిష్కరించిన గణేష్ ముదిరాజ్ ..

**మూవీ ఘనవిజయం సాధించాలని ఆకాంక్ష..**



మియాపూర్ అక్షిత ప్రతినిధి: ఫ్రెండ్ నాట్ ఎండ్ మూవీ షార్ట్ మూవీ పోస్టర్‌ను ఆదివారం రోజు మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ చిత్రంలో అంజి హీరోగా, స్మార్ట్ సుప్రియ హీరోయిన్‌గా నటించగా, అరుణ్ చిరుమణి కథా రచయిత మరియు దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతూ ఘన విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాననీ, చిత్ర యూనిట్ కు శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వై. నితిన్, శంకర్, సాయి నరసింహ, నీలకంఠ, చిన్న నాని, నరసింహ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



# నాయనపల్లి మైసమ్మ దగ్గర అధిక రేట్లకు మద్యం అమ్మకాలు

## అనుమతి లేని బెల్టు షాపులు

## ఒక క్వార్టర్‌పై 40 రూపాయలు అధికం

## పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ప్రతి ఆదివారం జరిగే నాయినోని పల్లి మైసమ్మ దగ్గర విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. ఆదివారం వచ్చిందంటే వేలాది మంది భక్తులు మై సింబల్ దర్శించుకునేందుకు వస్తుంటారు. మైసమ్మ ఆవరణలో వెలిసిన బెల్టు షాపుల లో ఒక కోటర్ పై 40 రూపాయలు అధికంగా తీసుకుంటున్నట్లు భక్తులు లింగాల మండలం మానాజీపేట గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్ ఆరోపిస్తున్నారు. ఎందుకు ఇంత ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు  అని అడుగుతే పెద్ద కార్ పాముల. యాపట్ల .పెద్ద కొత్తపల్లి. గ్రామాలలో ఉన్నటువంటి వైన్ షాపుల లో ప్రతి క్వార్టర్ పై 20 రూపాయలు ఇస్తున్నారు అంటూ బెల్ట్ షాపు నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఒక క్వార్టర్ పై 40 రూపాయలు, ఆఫ్-పై □80 రూపాయలు. ఫుల్లు బాటిల్ పై 160 రూపాయలు. అమ్ముతున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా మైసమ్మ దగ్గర దోపిడీ జరిగితే అధికారులు ఏం చేస్తున్నట్లు అంటూ భక్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా మైసమ్మ దగ్గర ఉన్న కమిటీ సభ్యులు ఈ బెల్ట్ షాపులపై ఒక కన్ను పెట్టి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా ఎక్సైజ్ అధికారులు కూడా తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# జలకం రత్తమ్మకి ఘన నివాళులు అర్పించిన బిజెపి నాయకులు



**భద్రాచలం, అక్షిత న్యూస్:** భద్రాచలం పట్టణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు కాలనీలోని ఆదివాసీ కుల పెద్ద  జలకం రత్తమ్మ  భౌతికకాయాన్ని ఆదివాసీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎ1988లో అల్లూరి సీతారామరాజు కాలనీ సాధన కోసం రత్తమ్మ  కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాగే కొత్త మార్కెట్‌లో నిర్మించిన షాపులను ఆదివాసీలకు కేటాయించే విషయంలో ఆమె విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కాలనీలో నిర్వహించే సమ్మక్క--సారలమ్మ జాతర ఏర్పాట్లు, నిర్వహణలోనూ ఆమె ఎప్పుడూ ముందుండి సేవలందించేవారని కొనియాడారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అనంతరం నాయకులు రత్తమ్మ  కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.  ఈ కార్యక్రమంలో  కుంజా ధర్మారావు, మానె రామకృష్ణ, పూనెం వీరభద్రం, గుండి శరత్, జగ్గా పుల్లయ్య, జగ్గా కుమారి, సున్నం భూలక్ష్మి, కోర్సా చినబాబు దొర, కుంజా శ్రీను, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తారి రామేశ్వరమ్మ కుటుంబానికి అండగా ఉంటాం

## కల్వకుర్తి కాంగ్రెస్ నేతలు బృంగి ఆనంద్ కుమార్

## చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మున్సిపాలిటీ లోని 21వ వార్డ్ కు చెందిన చిత్తరి రామేశ్వరమ్మకు చెందిన పూరి గుడిసె   శనివారం అర్ధరాత్రి పూర్తిగా కాలి పోయింది. ఆదివారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డిలు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశా రు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ లు మబ్బు రామరాజు,చిత్తరి శ్రీనివాసులు,మాజీ కౌన్సిలర్ చిన్న,నాయకులు మందుల ఈశ్వర్, పరశు రాం,రెహమాన్,నేరటిమల్లేష్,కొండల్,పడకంటి వెంకటేష్,దున్న సురేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** సత్వర న్యాయ పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక ప్రజలకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం అందించేందుకు నిర్వహించబడుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి,  విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ  మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు.

ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# పాలమూరు మీడియా రాయల్స్‌పై పాలమూరు బుల్డోజర్స్ ఘన విజయం




**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో బండి విజయ్, మెట్టుకాడి ప్రభాకర్ కెప్టెన్సీలోని పాలమూరు బుల్డోజర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో పాలమూరు మీడియా రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన బుల్డోజర్స్ ఆటగాళ్లు ప్రత్యర్థి జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన పాలమూరు మీడియా రాయల్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 77 పరుగులు చేసింది. బుల్డోజర్స్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌లను నియంత్రిస్తూ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టారు.

78 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు బుల్డోజర్స్ జట్టు ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు శుభారంభం అందించగా, మధ్యవరుస బ్యాట్స్‌మెన్‌లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చారు. కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 78 పరుగులు సాధించిన బుల్డోజర్స్ జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది.

ఈ విజయంతో పాలమూరు బుల్డోజర్స్ జట్టు టోర్నమెంట్‌లో తన సత్తాను మరోసారి నిరూపించింది. కెప్టెన్ మెట్టుకాడి ప్రభాకర్ నాయకత్వం, ఆటగాళ్ల సమష్టి కృషి జట్టు విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

అభిమానుల హర్షధ్వానాల మధ్య "సమష్టి కృషి -- అద్భుత విజయం" అనే నినాదాన్ని సాకారం చేస్తూ పాలమూరు బుల్డోజర్స్ విజేతగా నిలిచింది.

**స్కోర్ వివరాలు:**

**పాలమూరు మీడియా రాయల్స్:** 10 ఓవర్లలో 77 పరుగులు

**పాలమూరు బుల్డోజర్స్:** 2 వికెట్ల నష్టానికి 78 పరుగులు

**ఫలితం:** పాలమూరు బుల్డోజర్స్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. పాల్గొన్న  క్రీడాకారులు తిరుపతయ్య, జమీల్, సుకుమార్, రఫీ , కార్తీక్, కటిక రవి, వెంకటేష్, గోపాల్, పవన్ కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం పట్టణ శాఖ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా దుంపల ప్రకాష్ నియామకం



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం లో మహేశ్వరం పట్టణ శాఖ ఉపాధ్యక్షులుగా దుంపల ప్రకాష్ నీ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్, అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యల దేవేందర్, . కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, సేవాదళ్ మండల అధ్యక్షులు శెట్టి అశోక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ 8 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ ఇర్షాద్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడా రాకేష్ ముదిరాజ్ యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు స్వర్ణగంటి ఆకాష్, యువ నాయకులు కాకి శివ రామకృష్ణ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, యూత్ క్రికెటర్ ముచ్చంతల శ్రీను, రెడ్డి సంఘం నాయకులు గడ్డం నారాయణరెడ్డి,సీనియర్ నాయకులు రేవెళ్ల జంగయ్య, మోతే యాదయ్య, గగనం ఆంజనేయులు,స్వర్ణగంటి చంద్రయ్య, మోదిని నాగరాజు, రేవెల్ల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.